సాక్షి
శ్రీకాకుళం

ఆదివారం । 3 । సెప్టెంబర్ । 2023



ఊరికి ఆర్థిక ఊతం
15వ ఆర్థిక సంఘ నిధులు విడుదలయ్యాయి. వీటితో పల్లెల్లో పనులు జరగనున్నాయి.

- 8లో



109 బోధన పోస్టులు
జీఆర్‌ఏయూకు 109 బోధన పోస్టులు మంజూరు చేశారు. త్వరలో భర్తీ చేస్తారు.

- 8లో

ఆధార్ అనుసంధానం తప్పనిసరి
అరసవల్లి: జిల్లాలో విద్యుత్ వినియోగదారులంతా తప్పనిసరిగా తమ సర్వీస్ నంబర్లకు ఆధార్ నంబర్లకు అనుసంధానం చేయాలని ఈపీడీసీఎల్ సర్కిల్ ఎస్ఈ ఎల్.దైవప్రసాద్ తెలియజేశారు. ఇందుకోసం ప్రతి వినియోగదారుడు తమ ఆధార్ నంబర్లను సమీప సెక్షన్ ఆఫీస్‌లకు లేదా బిల్లు చెల్లించేటప్పుడు గానీ సిబ్బందికి అందజేయాలని సూచించారు.

న్యూస్‌రీల్

నేరుగా ఇంటికే పౌష్టికాహారం
శ్రీకాకుళం అర్బన్: ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ప్రతి నెల 5వ తేదీ లోపల గర్భిణులకు, బాలింతలకు పౌష్టిహారం పంపిణీ చేయాల్సి ఉండగా జిల్లా వ్యాప్తంగా ఈనెల 2వ తేదీ సాయంత్రానికే పంపిణీ చేసినట్లు ఐసీడీఎస్ పీడీ బి.శాంతి శ్రీ తెలిపారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎఫ్ఆర్ఎస్ యాప్ ద్వారా 93 శాతం అంగన్‌వాడీ కేంద్రాల్లో గల 70శాతం గర్భిణులకు, 75శాతం బాలింతలకు టేక్ హోం రెస్ట్(టీహెచ్ఆర్) పంపిణీ చేసినట్లు ఆమె పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల కంటే శ్రీకాకుళం జిల్లాలోనే అంగన్‌వాడీ కేంద్రాలు అధికంగా ఉన్నాయని, వీలైనంత త్వరగా పౌష్టికాహారం పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవడం జరిగిందని శాంతిశ్రీ తెలిపారు.

డిగ్రీ ఇన్‌స్టంట్ పరీక్షకు త్వరలో నోటిఫికేషన్



విద్యార్థులతో మాట్లాడుతున్న అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ ఇన్‌స్టంట్ పరీక్షకు త్వరలో నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు ఎగ్జామినేషన్స్ డీన్ డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్ చెప్పారు. విశ్వవిద్యాలయంలో డయల్ యువర్ యూనివర్సిటీ ఫోన్ ఇన్ లైవ్ కార్యక్రమం శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎక్కువ మంది విద్యార్థులు ఇన్‌స్టంట్‌పై విజ్ఞప్తి చేశారు. డిగ్రీ నాలుగు, ఆరో సెమిస్టర్ల సప్లిమెంటరీ ఫలితాల విడుదలపై కూడా ప్రశ్నించారు. వారం రోజుల్లోగా ఈ ఫలితాలు విడుదల చేస్తామని అధికారులన్నారు. డిగ్రీ ఇయర్ ఎండ్ స్పెషల్ డ్రైవ్ పరీక్ష కోసం విద్యార్థులు ప్రశ్నించగా, ఈ ఏడాది నిర్వహించటం లేదని తెలిపారు.

శాశ్వత లోక్ అదాలత్ సేవలపై అవగాహన



మాట్లాడుతున్న శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ జి.జ్ఞాన సువర్ణరాజు

శ్రీకాకుళం న్యూకాలనీ: ప్రజా ప్రయోజన సేవల్లో ఎలాంటి అవాంతరాలు కలిగినా సత్వరం శాశ్వత లోక్ అదాలత్‌ను సంప్రదించాలని శ్రీకాకుళం జిల్లా శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ జి.జ్ఞాన సువర్ణరాజు అన్నారు. శనివారం శ్రీకాకుళం నగరంలోని హెచ్‌పీఎస్ డిగ్రీ కళాశాలలో శాశ్వత లోక్ అదాలత్ సేవలు, ప్రజాప్రయోజన సేవలపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో జ్ఞాన సువర్ణరాజు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే చట్టాలపై కనీస అవగాహన పెంచుకోవాలన్నారు. శాశ్వత లోక్ అదాలత్ సేవలను ఎలా ఉపయోగించుకోవాలో విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో హెచ్‌పీఎస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ తమ్మినేని రామారావు, ఇంగ్లిష్ లెక్చరర్ కొత్తకోట రవీంద్ర, టీచింగ్, నాన్ టీచింగ్, సిబ్బంది పాల్గొన్నారు.

పిడుగుపాటుకు 20 గొర్రెలు మృతి



నందిగాం మండలం ఆనందపురం సమీపంలో పిడుగుపాటుకు మృత్యువాత పడిన గొర్రెలు

నందిగాం: నందిగాం మండలం ఆనందపురం గ్రామం సమీపంలో శనివారం పిడుగుపాటుకు 20 గొర్రెలు మృతి చెందాయి. మాదిగాపురం గ్రామానికి చెందిన మెట్ట ఫల్గుణరావు, తమ్మినేని ధర్మారావుకు చెందిన గొర్రెలు ఆనందపురం సమీపంలో మేత మేస్తుండగా శనివారం సాయంత్రం కురిసిన వర్షాలతో పాటు పిడుగుపాటుతో మృత్యువాత పడ్డాయి. దీంతో వారు కన్నీరుమున్నీరయ్యారు.

జన నేతకు.. ఘన నివాళి



ఆమదాలవలస: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం



కాశీబుగ్గలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేస్తున్న మంత్రి అప్పలరాజు



శ్రీకాకుళంలోని వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, పార్టీ నాయకులు అంధవరపు సూరిబాబు, దానేటి శ్రీధర్, ఎంవీ పద్మావతి తదితరులు

వైఎస్ రాజశేఖర రెడ్డి వర్ధంతి సందర్భంగా ఊరూరా ఆయన అభిమానులు, వైఎస్సార్‌సీపీ నాయకులు శనివారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. వైఎస్సార్ చిత్రపటాలు, విగ్రహాలకు క్షీరాభిషేకాలు నిర్వహించి ఆయన చేసిన మేలును స్మరించుకున్నారు. వైఎస్ ఆశయ సాధనకు కృషి చేస్తామని తెలిపారు.



కవిటిలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న జెడ్పీ చైర్ పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు

ఊరంతా ఒక్కటై..
టెక్కలి: టెక్కలి మండలం ముఖలింగాపురం పంచాయతీ పరిధి మారుమూల గిరిజన గ్రామం చిరుతునాపల్లి గ్రామంలో శనివారం గ్రామంలో గిరిజనులంతా మహానేత వర్ధంతి కార్యక్రమాన్ని సామూహికంగా నిర్వహించారు. వైఎస్ చేసిన మేలును తలచుకుని ఆయనకు అంజలి ఘటించారు. సర్పంచ్ పులిబంద రాకేష్ నేతృత్వంలో గ్రామంలోని గిరిజనులంతా ఇంటికొక వైఎస్సార్ చిత్రపటాన్ని ఏర్పాటు చేసి క్షీరాభిషేకాలు నిర్వహించారు.



చిరుతునాపల్లి గిరిజన గ్రామంలో మహానేత డాక్టర్ వైఎస్సార్ చిత్రపటాలకు పాలాభిషేకంతో నివాళులు అర్పిస్తున్న గిరిజనులు

పరికరం.. రైతుకు వరం



- రైతులకు అందుబాటులోకి ఆధునిక డ్రోన్లు
- పురుగు మందుల పిచికారీ సులువు
- జిల్లాకు తొలి విడతగా 25 డ్రోన్లు మంజూరు
- ఒక్కో డ్రోన్ విలువ రూ. 10 లక్షలు
- ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీ రూ.4 లక్షలు
- ప్రభుత్వ ప్రోత్సాహంతో ఉచితంగా శిక్షణ పొందిన 18 మంది పైలెట్లు

నరసన్నపేట:

అన్నదాతకు సాంకేతిక సాయం లభిస్తోంది. ప్రభుత్వం వైఎస్సార్ యంత్ర సేవా పథకాన్ని అమలు చేస్తూ అన్నదాతలకు అత్యాధునిక పరికరాలు అందజేస్తోంది. ఇప్పటికే ట్రాక్టర్లు, ఇతర వ్యవసాయ పరికరాలు 40 శాతం సబ్సిడీపై అందించిన జగనన్న ప్రభుత్వం ఇప్పుడు రైతులకు తాజాగా డ్రోన్లను కూడా సబ్సిడీపై అందజేస్తోంది. అత్యాధునిక టెక్నాలజీతో పురుగు మందులతో పాటు మల్టీ విటమిన్, నానో ఎరువులు పిచికారీ చేసేందుకు వీలుగా డ్రోన్లను అందుబాటులోకి తీసుకువచ్చింది. 2023- 24 ఆర్థిక సంవత్సరానికి కిసాన్ డ్రోన్లను రాయితీపై రైతన్నలకు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటోంది. జిల్లాకు ప్రస్తుతానికి 25 డ్రోన్లు మంజూరు చేసింది. ఈ నెలాఖరు నాటికి ఇవి రానున్నాయి.



నరసన్నపేట మండలం కిల్లాం వద్ద వరి పొలంలో పురుగు మందు పిచికారీ చేస్తున్న డ్రోన్

ఉపయోగాలివే..
- డ్రోన్ల ద్వారా ఏ కాలంలో అయినా అన్ని పంటలకూ క్రిమి సంహారక మందులు పిచికారీ చేసుకోవచ్చు.
- నానో యూరియా, డీఏపీ కూడా పిచికారీ చేసుకోవచ్చు. సులభంగా, వేగంగా పని పూర్తి చేసుకోవచ్చు. సమయం ఎంతో ఆదా అవుతుంది.
- ఖర్చు కూడా బాగా తగ్గుతుంది.
- వరి పంటలతో పాటు వాణిజ్య పంటలకూ ఈ డ్రోన్ల ద్వారా మందులు, మల్టీవిటమిన్స్ పిచికారీ చేయవచ్చు.
- కంది, మొక్క జొన్న, మామిడి, జీడి పత్తి పంటలతో పాటు ఉద్యానవన పంటలకూ ప్రయోజనకరం.
- తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో పిచికారీ చేయవచ్చు. రైతులు స్ప్రేయర్ల ద్వారా పిచికారీ చేయడం వల్ల ఎక్కువ విస్తీర్ణంలో చేయలేరు.
- డ్రోన్లతో అయితే ఎకరా విస్తీర్ణంలో పురుగు మందులు 15 నిమషాల్లో పిచికారీ చేయవచ్చు. రోజుకు 20 నుంచి 30 ఎకరాల్లో కూడా పిచికారీ చేయవచ్చు. అలాగే సమీప రైతు లందరూ ఒక సారి అనుకొని డ్రోన్ల ద్వారా పిచికారీ చేయవచ్చు.

కష్టాలు ఉండవు
పంటలపై స్ప్రేయర్లతో పురుగు మందులు పిచికారీ చేస్తే రైతులకు విష ప్రభావం కలుగుతుంది. తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే ప్రాణాలకు కూడా ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంటుంది. అయితే డ్రోన్ల ద్వారా పురుగు మందులు పిచికారీ చేస్తే ఎలాంటి ప్రమాదం ఉండదు. రైతులు విష ప్రభావానికి గురికారు.

25 డ్రోన్లకు ప్రతిపాదనలు
జిల్లాకు మొదటి విడతగా 25 డ్రోన్లు మంజూరయ్యాయి. ఈ మేరకు వ్యవసాయ శాఖ ప్రతిపాదనలు పంపారు. ఆ నెలాఖరుకల్లా డ్రోన్లు జిల్లాకు రావచ్చని భావిస్తున్నారు. ఒక్కో డ్రోన్ రూ.10 లక్షల నుంచి రూ. 12 లక్షలు ఉంటుంది. ఇందులో ప్రభుత్వం 40 శాతం సబ్సిడీ ఇస్తుంది. రైతు భరోసా కేంద్రాలకు అనుసంధానంగా ఉన్న సీహెచ్‌సీలకు వీటిని ఇవ్వనున్నారు.

శిక్షణ పూర్తి..
జిల్లాలో ఇప్పటి వరకూ 18 మందికి పైలెట్ శిక్షణ నిచ్చారు. గుంటూరులోని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ యూనివర్సిటీలో పది రోజుల పాటు శిక్షణ నిచ్చారు. టెన్త్, ఇంటర్ చదివిన, బీఎస్సీ అగ్రికల్చర్ కోర్సు పూర్తిచేసిన రైతులను శిక్షణకు ఎంపిక చేశారు. పాస్ పోర్టు కలిగిన వారికే శిక్షణకు ఎంపిక చేశారు.

శిక్షణ పూర్తి చేశాను



డ్రోన్ల ద్వారా పురుగు మందులు పిచికారీ చేసేందుకు పైలెట్‌గా నన్ను ఎంపిక చేసి శిక్షణకు పంపారు. గుంటూరు ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ యూనివర్సిటీలో 10 రోజులు శిక్షణ ఇచ్చారు. ఖర్చులు అన్నీ ప్రభుత్వం పెట్టుకుంది. పూర్తి స్థాయిలో శిక్షణ ఇచ్చారు. డ్రోన్లు అందుబాటులోకి వస్తే రైతులకు ప్రయోజనకరంగా ఉంటుంది. – బి.దుర్గాప్రసాద్, సత్యవరం

రైతులకు ప్రయోజనకరం



ప్రస్తుతం వరి పంటలతో పాటు ఇతర వాణిజ్య, ఉద్యానవన పంటలకు పురుగు మందులు పిచికారీ చేయాలంటే రైతులు నానా అవస్థలు పడుతున్నారు. ఎంతో సమయం వెచ్చిస్తున్నారు. డ్రోన్లు వినియోగంలోకి వస్తే పురుగు మందులు పిచికారీ ఎంతో సులువవుతుంది. మూడు రోజుల క్రితం నరసన్నపేట మండలం కిల్లాంలో డెమో ఇచ్చాం. రైతులు ఎంతో సంతృప్తి చెందారు. – కె.శ్రీధర్, జేడీ వ్యవసాయ శాఖ శ్రీకాకుళం

12న జిల్లా స్థాయి యువజనోత్సవాలు



సెట్‌శ్రీ సీఈఓ బీవీ ప్రసాదరావు

శ్రీకాకుళం న్యూకాలనీ: యువజన సర్వీసుల శాఖ ఆదేశాల మేరకు ఈనెల 12వ తేదీన జిల్లాస్థాయి యువజనోత్సవాలను నిర్వహిస్తున్నట్టు సెట్‌శ్రీ సీఈఓ బీవీ ప్రసాదరావు తెలిపారు. 15 నుంచి 29 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన యువతీ యువకులు పాల్గొనే ఈ సాంస్కృతిక పోటీలను శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలోని సిల్వర్ జూబ్లీ ఆడిటోరియం వేదికగా ఆరోజు ఉదయం 9 గంటల నుంచి నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన బృందాలు రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధిస్తాయని, అక్కడ రాణించిన వారు జాతీయ పోటీలకు ఎంపికవుతారని చెప్పారు.

ఏయే విభాగాల్లో పోటీలంటే..?
జిల్లాస్థాయిలో జానపద బృంద నృత్యం, జానపద బృంద గీతాలు, జానపద సోలో నృత్యం, జానపద సోలో గీతాలు ఉంటాయన్నారు. అలాగే లైఫ్ స్కిల్ కేటగిరీ విభాగాల్లో స్టోరీ రైటింగ్, పోస్టర్ మేకింగ్, ఫొటోగ్రఫీ విభాగాల్లో పోటీలు ఉంటాయని సీఈఓ తెలిపారు. యువతీ యువకులు, కళాశాల విద్యార్థులంతా సన్నద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. మరిన్ని వివరాలకు జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో ఉన్న సెట్ శ్రీ కార్యాలయాన్ని లేదా కార్యాలయ మేనేజర్ వీవీ అప్పలనాయుడు (7396219578)ను కార్యాలయ పనివేళల్లో సంప్రదించాలని కోరారు.

‘రుణాల మంజూరుకు ముందుకు రావాలి’



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం అర్బన్: జిల్లాలో రైతులు, మహిళలకు బ్యాంకర్లు రుణాలు మంజూరు చేయాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ ఆదేశించారు. అలాగే ఎంఎస్ఎంఈలకు విరివిగా రుణాలు మంజూరు చేసి, జిల్లా పారిశ్రామికంగా ఎదిగేందుకు కృషిచేయాలని సూచించారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శనివారం ఆయన బ్యాంకర్లతో జిల్లాస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. రైతులకు రుణాలు ఆపవద్దని బ్యాంకర్లను ఆదేశించారు. బ్యాంకుల వారీగా ఉన్న లక్ష్యాలను తెలియజేయాలని సంబంధిత జిల్లా అధికారులు, లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్‌ను ఆదేశించారు. రైతులు, కౌలు రైతులకు రుణాలు మంజూరు చేయాలన్నారు. ప్రధానమంత్రి ఫార్మలైజేషన్ ఆఫ్ ఫుడ్ ప్రాసెసింగ్, పరిశ్రమలకు ఇచ్చిన రుణాల తిరిగి చెల్లింపులు, ఎంఎస్ఎంఈ లక్ష్యాలు జిల్లాలో తక్కువగా ఉందని, బ్యాంకులన్నీ లక్ష్యాలు పెంచాలన్నారు. విద్యా రుణాల లక్ష్యాలను పెంచాలని చెప్పారు. పశు సంవర్థక శాఖ జేడీ కిశోర్‌కుమార్ మాట్లాడుతూ బ్యాంకర్లు రుణాలు త్వరగా మంజూరు చేయడం లేదని చెప్పగా సంబంధిత బ్యాంకు అధికారి మాట్లాడుతూ కొంత మంది రైతులు రుణాలు తిరిగి చెల్లించడం లేదని, తదితర సమస్యలను కలెక్టర్‌కు వివరించారు. మత్స్యశాఖ, ఉద్యానవన శాఖ రుణాలపై చర్చించారు. వైఎస్సార్ చేయూత, జగనన్న తోడు, తదితర పథకాలు బ్యాంకుల్లో పెండింగ్‌లో ఉన్నాయని, పెండింగ్‌లో లేకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. సెప్టెంబర్ ఆఖరు నాటికి పెండింగ్‌లో ఉన్న ప్రభుత్వ పథకాలు పూర్తి చేయాలని ఆదేశించారు. డీఆర్‌డీఏ, మెప్మా, టిడ్కో, జగనన్న సంపూర్ణ గృహ హక్కు పత్రం రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లతో రుణాలకు వస్తే మంజూరు చేయాలని చెప్పారు. జగనన్న సంపూర్ణ గృహ హక్కు పత్రాలు తీసుకున్న వారు రుణాలు పొందవచ్చునని గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా పత్రాలు పొందిన వారికి తెలియజేయాలని హౌసింగ్ పీడీని ఆదేశించారు. ప్రధానమంత్రి విశ్వకర్మ లబ్ధిదారులకు మొదటి దశలో లక్ష రూపాయలు, రెండో దశలో రెండు లక్షల రూపాయలు మంజూరు చేయాలని, వడ్డీ 5 శాతం వడ్డీ వసూలు చేయాలన్నారు. జిల్లాలో 15 వేల మందికి రుణాలు మంజూరుకు లక్ష్యమన్నారు.

‘జీ20 సదస్సు విజయవంతం కావాలి’



బ్రాహ్మణతర్లా ఉన్నత పాఠశాలలో జీ 20 దేశాల సదస్సు గురించి ఉపాధ్యాయుల డెమో

పలాస: మన దేశంలో జరుగుతున్న జీ 20 దేశాల సదస్సును విజయవంతం చేయాలని పలాస మండలం బ్రాహ్మణతర్లా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఆకాంక్షించారు. ఈ మేరకు పాఠశాలలోని ఉపాధ్యాయులు, విద్యార్థులు కలసి జి 20 దేశాల సదస్సు గురించి విద్యార్థులకు అవగాహన కలిగించారు. విద్యార్థులు పలు దేశాల ప్రతినిధులుగా వ్యవహరించారు.

హెల్త్ కేర్ పీజీ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం రూరల్: రాగోలులో గల జెమ్స్ ఆస్పత్రిలో బొల్లినేని మెడిస్కిల్స్‌లో హెల్త్‌కేర్ పీజీ కోర్సుల్లో అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మాస్టర్ ఆఫ్ హెల్త్‌కేర్ అడ్మినిస్ట్రేటివ్, పీజీ డిప్లమా ఇన్ మెడికల్ రికార్డ్స్ హెల్త్ ఇన్ఫర్మేషన్ కోర్సులకు ఏదైనా డిగ్రీ చేసిన అభ్యర్థులు అర్హులన్నారు. మరిన్ని వివరాలకు 7995013422, 7680945357 అనే నంబర్‌ను సంప్రదించాలన్నారు.

క్లుప్తంగా

కూర్మనాథుని సన్నిధిలో హైకోర్టు జడ్జి రాజశేఖర్



శ్రీకూర్మనాథుని సన్నిధిలో హైకోర్టు జడ్జి రాజశేఖర్

గార: ప్రముఖ విష్ణుక్షేత్రం శ్రీకూర్మంలోని కూర్మనాథుడిని హైకోర్టు న్యాయమూర్తి టి.రాజశేఖర్ శనివారం దర్శించుకున్నారు. ఆలయ మర్యాదలతో అర్చకులు, అధికారులు ఎదురేగి స్వాగతం పలికారు. ముందుగా మూలవిరాట్‌కు పూజల అనంతరం లక్ష్మీసన్నిధి, రెండు ధ్వజస్తంభాలు, వైష్ణవిదుర్గ, తాబేళ్ల పార్కును సందర్శించారు. ఆలయ ఈఓ జి.గురునాథం క్షేత్ర ప్రసాదాన్ని అందజేశారు. ఆయన వెంట అరవల రామకృష్ణ తదితరులున్నారు.

'రెడ్‌క్రాస్ సేవలు మరింత చేరువ కావాలి'



భూమి పూజ చేస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం కల్చరల్: రెడ్‌క్రాస్ సేవలు ప్రజలకు మరింత చేరువ కావాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అన్నారు. స్థానిక జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం ఆవరణలో ఉన్న రెండు సెంట్ల స్థలంలో రెడ్‌క్రాస్ పరిపాలన, నైపుణాభివృద్ధి భవన నిర్మాణానికి ఆయన శనివారం భూమిపూజ చేశారు. ఈ భవన నిర్మాణంతో మరింత మెరుగైన సేవలు అందజేయడానికి అవకాశం ఉందన్నారు. దీని ద్వారా భవిష్యత్‌లో అనేక శిక్షణ కార్యక్రమాలు, విపత్తులు, ఫస్ట్ ఎయిడ్, జూనియర్, యూత్ రెడ్‌క్రాస్ తదితర కార్యక్రమాలు చేపట్టవచ్చని తెలిపారు. రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు మాట్లాడుతూ సేవా కార్యక్రమాలు విస్తరించడంలో ముందుంటామని, మగటపల్లి వెంకటరమణమూర్తి వెల్ఫేర్ అండ్ సర్వీస్ సొసైటీ, సహకారంతో పనులు ప్రారంభం చేస్తామని తెలిపారు.

'కేంద్రం వైఖరితో ప్రజలపై ఆర్థిక భారం'

వజ్రపుకొత్తూరు రూరల్: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలతో ప్రజలపై మరింత ఆర్థిక భారం పడుతుందని సీపీఎం నాయకులు బమ్మిడి ఆనందరావు విమర్శించారు. ఈ మేరకు మండలం పల్లిసారథిలో శనివారం ఆయన మాట్లాడుతూ నిత్యావసర సరుకుల ధరలతో పాటు పెట్రోల్, డీజిల్, విద్యుత్ చార్జీలను పెంచారని, అలాగే కరెంట్ కోతలు సృష్టిస్తూ ప్రజల నెత్తిపై గుదిబండలా మారారని విమర్శించారు. ప్రభుత్వ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తూ అంబానీ, అదానీలకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం పలు వినతులతో కూడిన వినతిపత్రాన్ని సర్పంచ్, సచివాలయ సిబ్బందికి అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బి.సుగుణ, కృష్ణ, కుమార స్వామి తదితరులు ఉన్నారు.

4 నుంచి పాఠశాల క్రీడా పోటీలు

ఇచ్ఛాపురం రూరల్: పాఠశాల క్రీడల సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 4, 7వ తేదీల్లో మండల స్థాయి క్రీడా పోటీలను నిర్వహించడం జరుగుతుందని మండపల్లి జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు జాడు ప్రకాశ్, పీడీ కె.పద్మనాభం తెలిపారు. శనివారం ఓ ప్రకటనలో పేర్కొంటూ మండపల్లి ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో 4వ తేదీన బాల, బాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, టెన్నికాయిట్ పోటీలు, 7వ తేదీన త్రోబాల్, బాల్ బ్యాడ్మింటన్, బ్యాడ్మింటన్, యోగా, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అండర్ 14, 17 ఏళ్లలోపు ఉన్న విద్యార్థులకు నిర్వహించే ఈ పోటీల్లో మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొనాలని, ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఎంపిక చేసి నియోజకవర్గ, జిల్లా స్థాయిలో నిర్వహించే పోటీలకు పంపిస్తారని తెలిపారు. వివరాలకు పీడీలు సయెద్ షాజన్(మండపల్లి), వజీర్ అహ్మద్(డొంకూరు)ను సంప్రదించాలని కోరారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	60,380–00
బంగారం(22సి. 10గ్రా.)	55,350–00
వెండి (కిలో)	80,000–00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 475.00
విజయనగరం	రూ. 479.00
శ్రీకాకుళం	రూ. 479.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹120	₹210	₹ 220

ఊరికి ఆర్థిక ఊతం

- 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరు
- మౌలిక వసతులకు ప్రాధాన్యం
- 30 మండలాల్లోని 912 పంచాయతీలకు రూ.36,09,22,655



కొత్తపేట గ్రామ సచివాలయం

వజ్రపుకొత్తూరు: ఊరికి ఆర్థిక ఊతం లభించింది. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం సచివాలయ వ్యవస్థ ద్వారా పల్లెకు పాలన చేరువ చేసింది. అంతే కాకుండా ప్రాధాన్యత క్రమంలో పంచాయతీల్లో అభివృద్ధి పనులు, మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తోంది. ఇప్పుడు తాజాగా 15వ ఆర్థిక సంఘం ద్వారా 2022–23 ఆర్థిక సంవత్సరానికి గాను ఇటీవల మొదట విడత రూ.360,922,655 నిధులను విడుదల చేశారు.

మొత్తం 30 మండలాల్లోని 912 పంచాయతీలకు గాను టైడ్ నిధులు కింద రూ.217,297,271, అన్‌టైడ్ నిధులు కింద రూ.143,625,384 కలిసి రూ.360,922,655 పీడీ ఖాతాలకు జమ కానున్నాయి. పంచాయతీల్లో చేపట్టే అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులను సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలో ఎప్పటికప్పుడు చెల్లించేందుకు వీలుగా ఆర్థిక స్వాతంత్ర్యం కల్పించారు. ఈ నిధులపై రాష్ట్ర ప్రభుత్వం పర్యవేక్షణ ఉంటుంది. పంచాయతీల్లో వివిధ ఖర్చులకు సంబంధించిన బిల్లులను ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గ్రామ స్వరాజ్య ఈ–పోర్టల్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. ఈ లావాదేవీల వివరాల సమాచారం ఎప్పటికప్పుడు పంచాయతీరాజ్ శాఖ ఉన్నతాధికారులకు తెలుస్తుంది. ప్రభుత్వ ట్రెజరీ అనుమతులు లేదా ఇతర ఉన్నతాధికారులు జోక్యం కూడా ఎక్కడా ఉండదని డీఎల్‌పీఓ ఐవీ రమణ వెల్లడించారు.

విధివిధానాలివే..

పంచాయతీలకు జమ అయిన నిధులను టైడ్, అన్‌టైడ్ భాగాలుగా విడగొట్టి మొదటి భాగంలో అంతర్గత రహదారులు, డ్రైనేజీలు, కల్వర్టుల నిర్మాణం, కరెంటు బిల్లుల చెల్లింపు, గ్రామ పంచాయతీ, అంగన్‌వాడీ, హెల్త్ సెంటర్, పంచాయతీ భవనాల అభివృద్ధికి వినియోగించుకోవాలి. వీటితో పాటు శ్మశాన వాటికల అభివృద్ధికి కూడా వినియోగించుకోవచ్చు. ఈ– పంచాయతీ నిర్వహణకు కంప్యూటర్ విడి భాగాలు కొనుగోలు చేసుకునేందుకు కూడా వినియోగించుకోవచ్చు. రెండో భాగంలో ప్రధానంగా తాగునీరు, పారిశుద్ధ్యం మెరుగు పరిచేందుకు, చేతి పంపులు, నీటి ట్యాంక్‌లు, మోటార్‌ల నిర్వహణ బాధ్యతను ఆయా పంచాయతీలే చూసుకోవాలి. అవసరమైతే మరమ్మతులు చేసుకోవాలి. 15వ ఆర్థిక సంఘం నిధుల విడుదలతో పంచాయతీ సర్పంచ్‌లు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మార్గదర్శకాల ప్రకారం ఖర్చు



కేంద్ర ప్రభుత్వం ద్వారా విడుదలైన మొదటి విడత 15వ ఆర్థిక సంఘం నిధులు పంచాయతీల పీడీ ఖాతాలకు జమ చేశాం. ఈ నిధులకు సంబంధించి విడుదల చేసిన మార్గదర్శకాల ప్రకారం ఖర్చు చేయాలి. ప్రాధాన్యత, మార్గదర్శకాల ప్రకారం ఖర్చు చేసి, సమస్యలను పరిష్కరించాల్సి ఉంటుంది. వివిధ అభివృద్ధి పనులకు వినియోగించిన నిధులకు సంబంధించిన బిల్లులను ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గ్రామ స్వరాజ్య ఈ–పోర్టల్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. ఈ బిల్లులపై ప్రభుత్వం ఏటా ఆడిట్ నిర్వహిస్తుంది. కొన్ని పంచాయతీల్లో కరెంటు బిల్లుల బకాయిలు ఉన్నాయి. అవి కచ్చితంగా చెల్లించాల్సి ఉంటుంది. మార్గదర్శకాలు అతిక్రమించి ఖర్చు చేస్తే సంబంధిత సర్పంచ్, కార్యదర్శులపై చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

– ఐవీ రమణ, డీఎల్‌పీఓ టెక్కలి

వ్యక్తి ఆత్మహత్య



మృతుడు సత్తిరాజు(ఫైల్)

సరుబుజ్జిలి: మండలంలోని చినకాగితాపల్లి పంచాయతీ శాస్త్రులపేట గ్రామానికి చెందిన చిట్టివలస సత్తిరాజు(30) శనివారం తన ఇంటికి సమపంలోని చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయనకు భార్య కుమారి, ఏడేళ్ల వయస్సు గల పాప ఉన్నారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సత్తిరాజు గుంటూరులో స్పిన్నింగ్ మిల్లులో పనిచేస్తున్న సమయంలో విజయనగరం జిల్లా మెంటాడకు చెందిన కుమారి అనే అమ్మాయితో 2014లో పరిచయం ఏర్పడింది. అది ప్రేమగా మారడంతో 2015లో వీరిరువురు ప్రేమ వివాహం చేసుకున్నారు. 2016 వీరికి ఒక పాప పుట్టింది. తర్వాత ఆమె వలంటీర్‌గా చేరారు. అయితే 2021 నుంచి తన భర్త తన వద్దకు రావడం లేదని ఆమె ఆంధ్ర పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదు చేసింది. పోలీసులు భార్యాభర్తలను స్టేషన్‌కు పిలిచి సక్రమంగా కాపురం చేసుకోమని కౌన్సిలింగ్ ఇచ్చారు. మూడు రోజుల కిందట సత్తిరాజు స్వగ్రామం శాస్త్రులుపేట వచ్చాడు. అప్పటి నుంచి దిగాలుగా కనిపించేవాడు. అదే మనస్తాపంతో శనివారం తన ఇంటి సమీపంలో ఉన్న చింతచెట్టుకు ఉరి వేసుకున్నాడు. వెంటనే మృతుని తల్లి గ్రామస్తులను పిలవగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. మృతుడి భార్య కుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించినట్లు ఎస్‌ఐ కృష్ణప్రసాద్ తెలిపారు.

వీరావల్‌లో జిల్లా మత్స్యకారుడు మృతి



వేటకు వెళ్లి మృతి చెందిన అప్పారావు (ఫైల్)

రణస్థలం: మండలంలోని ఎన్‌జీఆర్ పురం పంచాయతీలో గల పోతయ్యపేట గ్రామానికి చెందిన చీకటి అప్పారావు(49) గుజరాత్ రాష్ట్రం వీరావల్‌లో మరణించినట్లు మండల మత్స్యశాఖ అధికారి గంగాధర్, గ్రామ పెద్దలు పిల్లా తాత, ఎంపీటీసీ ఉప్పాడ అప్పన్నలు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం గుజరాత్ రాష్ట్రంలోని సోమనాథ్ జిల్లా వీరావల్ ప్రాంతానికి కొన్ని రోజుల కిందట అప్పారావు వలస వెళ్లారు. అక్కడ బోటులో వేట సాగిస్తుండగా గత నెల 30వ తేదీన వేటకు ఉపయోగించిన వస్తువు ప్రమాదవశాత్తు పొట్టలో తగిలిందని తెలిపారు. వెంటనే రాత్రికి ఒడ్డుకు చేరుకుని ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం ఉదయం మరణించినట్లు చెప్పారు. మృతునికి భార్య దానేసు, ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుమారులు కూడా తండ్రితో పాటు గుజరాత్ వేటకు వెళ్లారని తెలిపారు. భార్య, వివాహిత అయిన కుమార్తె పోతయ్యపేటలో ఉంటున్నారు. విషయం తెలిసి కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

రోడ్డు దాటుతుండగా..



మృతి చెందిన ఆదినారాయణ (ఫైల్)

రణస్థలం: మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై రోడ్డు దాటుతుండగా వాహనం ఢీకొని నేతల ఆదినారాయణ (60) మృతి చెందారు. రణస్థలం పంచాయతీలో పారిశుద్ధ్య కార్మికుడిగా పనిచేస్తున్న ఆదినారాయణ శనివారం ఉదయం 5.15 గంటల సమయంలో అక్షయ హొటల్ సమీపంలో రోడ్డు దాటుతుండగా శ్రీకాకుళం వైపు నుంచి విశాఖపట్నం వైపు వెళుతున్న గుర్తు తెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఆదినారాయణ ప్లాస్టిక్ బాటిళ్లు సేకరించి అమ్ముతుంటారని, అలా సేకరించేందుకు రోడ్డు దాటుతుండగా ప్రమాదం జరిగిందని తెలిపారు. మృతుని భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. జే.ఆర్.పురం ఏఎస్‌ఐ పి.సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లారీ ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు



గాయాలతో ఉన్న ఆదిబాబు



ప్రమాద స్థలంలో లారీ

రణస్థలం: మండలంలోని జేఆర్ పురం పంచాయతీలో గల సీతంవలస గ్రామ సమీపంలో లారీ ఢీకొని లంకలపల్లి ఆదిబాబు అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. జేఆర్ పురం పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం లావేరు మండలంలోని లావేటి పాలెం గ్రామానికి చెందిన ఆదిబాబు శనివారం సాయంత్రం బైక్‌పై రణస్థలం నుంచి లావేటి పాలెం వస్తుండగా వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొట్టింది. దీంతో ఆదిబాబుకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆయనను 108 వాహనంపై శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్స కోసం విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేయాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

'జీడి కార్మికులపై ఆరోపణలు రుజువు చేయాలి'

కాశీబుగ్గ: జీడి కార్మికులపై మోపిన ఆరోపణలు రుజువు చేయాలని, లేదంటే మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని కాష్యూ లేబర్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు అన్నారు. 20వ వార్డు మంకినమ్మ ఆలయం వద్ద జీడి కార్మికులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. పాట్నూరు బాలరాజు జీడి పరిశ్రమలో పనిచేస్తున్న పదిహేను మంది జీడి కార్మికులపై దొంగలు అని వేసిన నిందకు ఆధారాలు చూపాలన్నారు. సీసీ ఫుటేజీలు, దొంగతనం చేసినట్లు సాక్ష్యం చూపించాలని అన్నారు. జీడి పరిశ్రమల యాజమాన్యం కార్మికులకు నోటీసులు అందించకుండా బంద్ చేపట్టడం సరైన నిర్ణయం కాదన్నారు. కార్యక్రమంలో ఆ సంఘ అధ్యక్షులు అంబటి ఆనందరావు, సీఐటీయూనాయకులు నెయ్యిల గణపతిరావు, లండ రమణ, కోవిరి కోదండరావు, జోగి నాగేశ్వరరావు, చొక్కర ఈశ్వరరావు, పొగడదండ అప్పలస్వామి, మహిళలు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

'తుది జాబితా త్వరలో విడుదల చేస్తాం'

శ్రీకాకుళం పాతబస్టాండ్: జూనియర్ అసిస్టెంట్ అండ్ కంప్యూటర్ అసిస్టెంట్ పోస్టు కంప్యూటరు ప్రొఫిషియన్సీ టెస్టు ఫలితాలు శ్రీకాకుళం.ఏపి.జీఓవి.ఇన్‌లో పొందుపరిచామని డీఆర్‌ఓ పి.మురళీకృష్ణ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం నోటిఫై చేసిన పోస్టులకు అర్హత కలిగిన అభ్యర్థుల తుది జాబితా (1:1) తదుపరి విడుదల చేస్తామని పేర్కొన్నారు. కంప్యూటర్ ప్రొఫిషియన్సీ టెస్టు రాసిన అభ్యర్థులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

ద్విచక్ర వాహనం చోరీ

కోటబొమ్మాళి: మండలం నిమ్మాడ జంక్షన్‌లోని పెదకోట శ్రీకాంత్‌కు చెందిన బైక్ చోరీకి గురైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శ్రీకాంత్ ఆమదాలవలసకు చెందిన తన మేనమామ బజాజ్ బైక్‌ను వాడేందుకు ఇంటికి తెచ్చుకున్నాడు. ఎప్పటిలాగే శుక్రవారం రాత్రి తన ఇంటిముందు పెట్టి నిద్రపోయాడు. శనివారం ఉదయం చూసేసరికి బైక్ కనిపించలేదు. వెతికినా దొరకలేదు. దీంతో బాధితుడు కోటబొమ్మాళి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ విశ్వేశ్వరరావు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

మెళియాపుట్టి: మండల కేంద్రంలోని ఏకలవ్య పాఠశాల సమీపంలో శనివారం సాయంత్రం ద్విచక్రవాహనం ఆటో ఢీకొని ముగ్గురు యువకులు గాయపడ్డారు. ఎస్‌ఐ రాజేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పెద్దపద్మాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని మామిడిగుడ్డి గిరిజన గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు జన్ని ప్రశాంత్, జన్ని ఉపేంద్ర, ధర్మారావులు బైక్‌పై మెళియాపుట్టి నుంచి మామిడిగుడ్డి గ్రామానికి వస్తుండగా.. టెక్కలి నుంచి మెళియాపుట్టి వెళ్తున్న ఆటో ఢీకొనడంతో ముగ్గురూ రోడ్డుపై పడి గాయపడ్డారు. స్థానికులు గమనించి మెళియాపుట్టి పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్‌ఐ రాజేష్ ఘటనా స్థలానికి వెళ్లి 108 వాహనం ద్వారా క్షతగాత్రులను టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఆటో డ్రైవర్ ఆపకుండా వెళ్లిపోయినట్లు గాయపడిన యువకులు చెబుతున్నారు. కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

'ప్రజల మనిషి అంధవరపు వరం'



వరం విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న కుటుంబ సభ్యులు

శ్రీకాకుళం: పేద ప్రజల మనసు తెలిసిన మనిషి అంధవరపు వరం అని కళింగ కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు అన్నారు. పట్టణంలో శనివారం వరం చారిటబుల్ ట్రస్టు, కుటుంబ సభ్యులు ఆధ్వర్యంలో మాజీ మున్సిపల్ చైర్మన్ అంధవరపు వరం మూడో వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడు రోడ్ల కూడలి వద్ద వరం విగ్రహానికి పూలు వేసి నివాళులు అర్పించారు. సూరిబాబు మాట్లాడుతూ కళింగ కోమట్ల అభ్యున్నతికి, పట్టణ ప్రజల అభివృద్ధికి వరం ఎంతగానో శ్రమించారని అన్నారు. కళింగ వైశ్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోణార్క్ శ్రీను మాట్లాడుతూ వరం రాజకీయ జీవితం గురించి వివరించారు. వరం కుమార్తె, మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ పైడిశెట్టి జయంతి మాట్లాడుతూ తన తండ్రి సూచనలు, ఆదర్శాలకు అనుగుణంగా సమాజ సేవలో నిరంతరం ఉంటున్నానని అన్నారు. వరం కుమారులు ప్రసాద్, సంతోష్‌లు మాట్లాడుతూ తమ తండ్రి చూపిన బాటలో నడుస్తూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రెండు లక్షల విలువైన తోపుడు బండ్లను 15 మందికి పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళింగ వైశ్య సంఘం ప్రతినిధులు ఊణ్ణ నాగరాజు, అంధవరపు రఘురాం, పీవీ రమణ, బోయిన గోవిందరాజులు, కోరాడ రమేష్, పిల్లల నీలాద్రి తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయానికి రూ.50వేలు విరాళం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పాతశ్రీకాకుళం కలెక్టర్ బంగ్లా ఎదురుగా ఉన్న అయ్యప్ప స్వామి దేవాలయం అభివృద్ధి కోసం రూ.50వేలు విరాళాన్ని వరం చారిటబుల్ ట్రస్టు తరఫున శనివారం సాయంత్రం అందించారు. ట్రస్టు ప్రతినిధులు అంధవరపు ప్రసాద్, సంతోష్, పైడిశెట్టి జయంతి తమ తండ్రి అంధవరపు వరాహ నరసింహం జ్ఞాపకార్థం ఈ విరాళం అందించారు.

నాటక కళకు జీవం



వెంకటరావును సత్కరిస్తున్న అతిథులు

శ్రీకాకుళం కల్చరల్: రంగస్థల కళాకారుల సమాఖ్య నాటక కళకు జీవం పోస్తోందని గార ఎంపీపీ గొండు రఘురాం అన్నారు. స్థానిక బాపూజీ కళామందిరంలో శ్రీకాకుళ రంగస్థల కళాకారుల నెలవారీ సాంస్కృతిక విభాగం 287వ నెల కార్యక్రమం శనివారం జరిగింది. సమాఖ్య కార్యనిర్వాహక అధ్యక్షుడు పన్నాల నర్సింహమూర్తి అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రతినెల ఒక కార్యక్రమం నిర్వహిస్తూ అనేక రకాల కళలను ప్రోత్సహించడం గొప్ప విషయమన్నారు. వీరి కృషిని చూసి తన వంతుగా రూ.5వేలు విరాళం అందిస్తున్నానని తెలిపారు. పేద కళాకారులకు నెలవారీ పింఛను అతిథులు అందించారు. రూ.3వేలుతో రచయిత వెంకటరావును సత్కరించగా, ఆ సొమ్మును సమాఖ్యకు విరాళంగా అందించారు.

ఆకట్టుకున్న ప్రదర్శన

ఈ సందర్భంగా సాంస్కృతిక ప్రదర్శనలో భాగంగా శ్రీకాకుళ రంగస్థల కళాకారుల సమాఖ్య నెలవారీ సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో 'ఆసరసాల' నాటిక ప్రదర్శన చక్కగా సాగింది. మూల నాటకాన్ని గంటేడ గౌరునాయుడు రచించగా నాటకీకరణను తాళాబత్తుల వెంకటేశ్వరరావు చేశారు. ఎల్.రామలింగస్వామి దర్శకత్వం వహించారు. ఇందులో కె.శాంతారాం, ఇంజరాపు రమణరావు, ప్రసాద్ రౌళో, చిట్టి వేంకటరావు, మెహర్ ప్రభాకర్, బంటుపల్లి రామచంద్రదేవ్, కేశిరెడ్డి రాజేశ్వరీ, బత్తుల లక్ష్మీ నటించారు. సంగీతం లీలామోహన్ అందించగా రంగాలంకరణ ఎస్.రమణారావు.

వర్సిటీకి 109 బోధన పోస్టులు మంజూరు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయానికి రేషనలైజేషన్ ఆధారంగా 109 బోధకుల పోస్టులు మంజూరు చేశారు. ఈ మేరకు విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ జె.శ్యామలరావు ఉత్తర్వులు జారీ చేశారు. 17 విభాగాలకు 16 ప్రొఫెసర్, 27 అసోసియేట్ ప్రొఫెసర్, 67 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు మంజూరు చేశారు. ఎంకాంకు ప్రొఫెసర్, రెండు అసోసియేట్ ప్రొఫెసర్, 4 అసిస్టెంట్ ప్రొఫెసర్, ఎకనామిక్స్, రూరల్ డెవలప్‌మెంట్‌కు కలిపి ప్రొఫెసర్, రెండు అసోసియేట్ ప్రొఫెసర్, 4 అసిస్టెంట్ ప్రొఫెసర్, ఇంటిగ్రేటెడ్ టీచర్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాం నాలుగేళ్ల డిగ్రీకి ప్రొఫెసర్, రెండు అసోసియేట్ ప్రొఫెసర్, 12 అసిస్టెంట్ ప్రొఫెసర్, ఇంగ్లిష్‌కు ప్రొఫెసర్, రెండు అసోసియేట్ ప్రొఫెసర్, 4 అసిస్టెంట్ ప్రొఫెసర్, ఎంఎల్‌ఐఎస్సీకి ప్రొఫెసర్, రెండు అసోసియేట్ ప్రొఫెసర్, 4 అసిస్టెంట్ ప్రొఫెసర్, మూడేళ్ల ఎల్‌ఎల్‌బీకి ప్రొఫెసర్, రెండు అసోసియేట్ ప్రొఫెసర్, 4 అసిస్టెంట్ ప్రొఫెసర్, సోషల్ వర్క్‌కు ప్రొఫెసర్, రెండు అసోసియేట్ ప్రొఫెసర్, 4 అసిస్టెంట్ ప్రొఫెసర్, బయోటెక్నాలజీ, మైక్రోబయోలజీకి ప్రొఫెసర్, రెండు అసోసియేట్ ప్రొఫెసర్, 4 అసిస్టెంట్ ప్రొఫెసర్, మ్యాథ్స్, అప్లైడ్ మ్యాథ్స్‌కు ప్రొఫెసర్, రెండు అసోసియేట్ ప్రొఫెసర్, 4 అసిస్టెంట్ ప్రొఫెసర్, కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్‌కు ప్రొఫెసర్, రెండు అసోసియేట్ ప్రొఫెసర్, 4 అసిస్టెంట్ ప్రొఫెసర్, మెకానికల్ ఇంజినీరింగ్‌కు ప్రొఫెసర్, రెండు అసోసియేట్ ప్రొఫెసర్, 4 అసిస్టెంట్ ప్రొఫెసర్, ఫిజికల్ డైరెక్టర్‌కు ఒక అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్లేస్ మెంట్ ఆఫీసర్‌కు ఒక అసోసియేట్ ప్రొఫెసర్, ఐక్యూఏసీ డైరెక్టర్‌కు ఒక ప్రొఫెసర్, ఆర్‌డీ సెల్ డైరెక్టర్‌కు ఒక ప్రొఫెసర్ పోస్టు మంజూరు చేశారు. ఈ మేరకు త్వరలో నోటిఫికేషన్ వెల్లడిస్తారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు స్క్రీనింగ్ పరీక్ష నిర్వహిస్తారు.



అభిమానం.. అపురూపం

ఇచ్ఛాపురం రూరల్:

పల్లె ప్రజలు తమ అభిమాన నేతను ఇంకా మర్చిపోలేకపోతున్నారు. వైఎస్ రాజశేఖర రెడ్డి మహాభినిష్క్రమణం జరిగి ఇన్నేళ్లవుతున్నా ఏటా తమ ప్రియమైన నాయకుడికి కన్నీటి నివాళులు అర్పిస్తున్నారు. వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా శనివారం అరకభద్ర గ్రామంలోని గ్రామ చావడి వద్ద వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి, పూజలు చేసి ఘనంగా నివాళులు అర్పించారు.

← వైఎస్సార్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న అరకభద్ర వాసులు